


# ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి

- ఊపందుకుంటున్న రాజకీయాలు
- ప్రైవేట్ ఉపాధ్యాయులకు అవకాశంతో పెరిగిన పోటీ
- ముందస్తు ప్రయత్నాల్లో ఉపాధ్యాయ సంఘ నేతలు
- మేము సైతం అంటున్న విద్యా సంస్థల అధినేతలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికీ ఎన్నికలు జరుగనుండడంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుల్లో రాజకీయ కలకలం ప్రారంభమైంది. ప్రభుత్వం విధించిన కొన్ని నిబంధనల పరిధిలోకి వచ్చే ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఓటు వేసే హక్కు కల్పించింది. దీంతో ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి పోటీ చేసే వారి సంఖ్య, ఓటర్ల సంఖ్య పెరగనున్నది. పలువురు ప్రైవేట్ విద్యాసంస్థల అధినేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఎమ్మెల్సీలుగా క్రియాశీల రాజకీయాల్లో పాలుపంచుకోవడానికి ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆసక్తి చూపిస్తున్నారు. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులందరూ ఎమ్మెల్సీ రాజకీయాల వైపు దృష్టిసారించారు.

### ● ఓటర్ల నమోదుపై దృష్టి

అక్టోబరు 2 నుంచి 15వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలలకు దసరా సెలవులు ఇచ్చారు. ఈ సమయాన్ని ఓటర్ల నమోదుకు, ప్రచారానికి వినియోగించుకోవాలని ఆశావహులు కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నారు. పట్టభద్రుల నియోజకవర్గం మాదిరిగానే కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎమ్మెల్సీ కూడా ఉంటుంది. ఈ నియోజకవర్గ పరిధిలో పని చేసే ఉపాధ్యాయులందరూ ఓటర్లుగా నమోదు చేసుకుని తమ ఎమ్మెల్సీని ఎన్నుకోవలసి ఉంటుంది. ప్రైవేట్ ఉపాధ్యాయులు నోటిఫికేషన్ నాటికి మూడు సంవత్సరాల సీనియార్టీ పూర్తి చేసుకుని ఉండాలి. పీఎఫ్ కానీ ఈఎస్ఐ కానీ కలిగి ఉండి ఆన్‌లైన్ పేమెంట్ జరుగుతున్న ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. ఎనిమిది నుంచి పదో తరగతి వరకు అన్ని సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులకు ఆపై బోధించే వారికి, విద్యార్హత ఉన్నవారికి ఓటు హక్కు పొందడానికి వీలు ఉం టుంది. ఈనెల 30 నుంచి ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభం కానున్నది. ఓటర్ల తుది జాబితాను నవంబరు 30న ప్రకటిస్తారు.

### ● రేసులో పలువురు

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూర రఘోత్తంరెడ్డి ఉన్నారు. ప్రస్తుతం ఈ ఎమ్మెల్సీ స్థానానికిగాను కరీంనగర్ జిల్లా నుండి పలువురు విద్యాసంస్థల అధినేతలు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పోటీ పడేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. పీఆర్టీయూ మాజీ బాధ్యులు నరహరి లక్ష్మారెడ్డి, జాలి మహేందర్‌రెడ్డి, తపస్ బాధ్యులు పోలు సత్యనారాయణ, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి పోటీలో ఉంటున్నట్లు ప్రకటించారు. సిద్దిపేట జిల్లాకు చెందిన ప్రస్తుత ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డితోపాటు వంగ మహేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాకుచెందిన పీఆర్టీయూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, నిజామాబాద్ నుంచి బీరెల్లి కమలాకర్ పోటీ చేస్తున్నట్లు తెలిసింది. ఉపాధ్యాయ కూటమి నుంచి, బీఆర్ఎస్ నుంచి బలమైన అభ్యర్థిని పోటీలో నిలబెట్టే అవకాశమున్నట్లు తెలిసింది. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఉపాధ్యాయ సంఘ బాధ్యులతోపాటు ప్రైవేట్ విద్యాసంస్థల అధినేతలు మరికొందరు కూడా పోటీలో ఉంటారని ప్రచారం జరుగుతుండడంతో పోటీ తీవ్రంగా ఉంటుందని భావిస్తున్నారు.

### ● నేటి నుంచి బొడ్డెమ్మ



ఇల్లందకుంట, సెప్టెంబరు 22: బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగను తెలంగాణ ఆడ పడుచులకు అత్యంత ఇష్టమైన పండుగలు. బొడ్డెమ్మ పండుగ బతుకమ్మ పండుగకు ముందు వస్తుంది. మహాలయ అమవాస్య సందర్భంగా ఎంగిలిపూల బతుకమ్మ మొదలయ్యే కంటే తొమ్మిది రోజుల ముందు వరకు బొడ్డెమ్మ జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో జిల్లాలో సోమవారం నుంచి బొడ్డెమ్మ పండుగను నిర్వహించనున్నారు. ఈ పండుగను బొడ్డెమ్మల పున్నమి అని కూడా అంటారు. ముఖ్యంగా ఈ పండుగను ఆడపిల్లలు, పెళ్లి కాని అమ్మాయిలతో జరిపిస్తారు.

## బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మధురనగర్‌లో అర్బన్ బ్యాంకు బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి

గంగాధర, సెప్టెంబరు 22: సహకార బ్యాంకులందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఆదివారం కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు శాఖను గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ సహకార బ్యాంకు గ్రామీణ ప్రాంతాల్లోని వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ రైతులు, చిరు వ్యాపారులు, స్థానిక ప్రజలు సహకార బ్యాంకు సేవలను ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా సహకార అధికారి రామానుజాచార్య పాల్గొన్నారు.

### ● పాలన.. మాతృబంధం..

పాలనలో ఎంత బిజీగా ఉన్నా కలెక్టర్ పమేలా సత్పతి తల్లిగా తన బాధ్యతను నిర్వహించారు. ఆదివారం గంగాధరలో అర్బన్ బ్యాంక్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ఆదివారం పాఠశాలలకు సెలవు దినం కావడంతో



కలెక్టర్ కుమారుడు అయిష్ తల్లితో వచ్చాడు. బ్యాంకును ప్రారంభించగానే కుమారుడు గారాబంతో రావడంతో సంతోషంగా తీసుకుని కలెక్టర్ ఒళ్లో కూర్చోబెట్టుకుని ముచ్చటించారు. కలెక్టర్ ఉద్యోగ బాధ్యతలతోపాటు కుటుంబానికీ ప్రాధాన్యమిస్తున్నారని అందరూ అనుకున్నారు.

## బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన

- 25న స్పెషల్ డ్రైవ్
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



సభ్యత్వ నమోదు చేయిస్తున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశ వ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదుకు మంచి స్పందన లభిస్తున్నదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లోని 57వ డివిజన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెంబర్ షిప్ అభియా న్‌లో భాగంగా పది కోట్ల సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. కరీంనగర్‌లో రెండు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్‌నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి బూత్‌లో 200 మందితో సభ్యత్వ నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా మని చెప్పారు. రాష్ట్రంలో 2028లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కేరళ రాష్ట్రంలోనూ బీజేపీ సభ్యత్వ నమోదుకు మంచి స్పందన లభిస్తున్నదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, కటకం లోకేష్, కొలగాని శ్రీనివాస్, బండ రమణారెడ్డి పాల్గొన్నారు.

## 26న యువతకు పోటీలు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 22: యువతకు ఈ నెల 26 నుంచి ఎనిమిది అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని డీవైఎస్‌వో వి శ్రీనివాస్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు, అక్కడ ప్రతిభ చూపిన వారిని జాతీయ స్థాయి యువజనోత్సవాలకు పంపిస్తామన్నారు. 26న యువజన పోటీలు, 27న సైన్స్ ఫెయిర్ ఉంటుందన్నారు. ఉదయం 9 గంటలకు కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఈ నెల 25 సాయంత్రం ఐదు గంటలలోపు పేరు, వయస్సు, పుట్టిన తేదీ, ఆధార్, అడ్రస్, ఫోన్ నంబర్, ప్రదర్శన వివరాలు జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో నమోదు చేయించుకోవాలన్నారు. మిగిలిన వివరాలకు 9640967943, 8008326913 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి

# ఉత్సాహంగా హాఫ్ మారథాన్

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 22: కరీంనగర్ సైక్లిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హాఫ్ మారథాన్ ఉత్సాహంగా సాగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో మారథాన్‌ను కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం వాకింగ్, రన్నింగ్ చేస్తే శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారవుతామని అన్నారు. ప్రతి రోజు కనీసం 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని అన్నారు. అనంతరం కరీంనగర్ సైక్లిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఐవీవై విద్యాసంస్థల అధినేత పసుల మహేశ్ మాట్లాడుతూ నగరవాసులకు ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించేందుకు మారథాన్ కార్యక్రమాన్ని 3కే, 6కే, 10కే, 21కే విభాగాల్లో నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, పలు పాఠశాలల విద్యార్థులు, పోలీసు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# విలీనం వద్దు

- ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపాదిత గ్రామాల్లో వ్యతిరేకత
- ఆందోళనకు సిద్ధమవుతున్న ప్రజలు



చింతకుట కెనాల్ వద్దనిరసన తెలుపుతున్న యువకులు

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 22: కరీంనగర్ కార్పొరేషన్‌లో పలు గ్రామాలను విలీనం చేయాలని ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలపై ఆయా గ్రామాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గతంలో కరీంనగర్‌లో విలీనం చేసిన గ్రామాలు దుర్భర స్థితిలో ఉన్నాయని, తమ గ్రామాలను విలీనం చేస్తే పన్నుల భారం తప్ప అభివృద్ధి ఉండదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాలను విలీనం చేయవద్దంటూ ఆందోళనకు సిద్ధం అవుతున్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో తమ గ్రామాలను విలీనం చేయవద్దని కరీంనగర్ మండలం దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామ ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు. తమ గ్రామాలను విలీనం చేయవద్దని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ మేరకు కార్యచరణ రూపొందించారు. సోమవారం ఉదయం 9గంటలకు గోపాల్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్దపెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ప్రకటించారు. విలీన ప్రతిపాదనను విరమించుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమానికి దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామ ప్రజా ప్రదనిధులు, నాయకులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున హజరు కావాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్ ఊరడి మల్లారెడ్డి, మాజి ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్ రావు, దుర్శేడ్ సింగిల్ విండో చైర్మన్ తోట తిరుపతి, నాయకులు ఊరడి శివారెడ్డి పాల్గొన్నారు.

● భగత్‌నగర్: కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామానికి కరీంనగర్ నగరపాలక సంస్థల విలీనం చేయవద్దని ఆదివారం చింతకుంట గ్రామస్థులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం
# ఎదురు చూపులు

- పూర్తయి మూడేళ్లయినా లబ్ధిదారులను ఎంపిక చేయని అధికారులు

హుజూరాబాద్, సెప్టెంబరు 22: గత ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్లు లేవని డబుల్ బెడ్ రూం కట్టి ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు కొన్ని ఇళ్ల నిర్మాణం చేపట్టింది. మూడేళ్లయినా లబ్ధిదారులను ఎంపిక చేయలేదు. 2018లో అప్పటి ప్రభుత్వం హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గణేష్‌నగర్‌లో పదెకరాల స్థలంలో ఇళ్ల నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్ భూమి పూజ చేశారు. రెండేళ్లలో సుమారు 500 ఇళ్ల వరకు సదరు కాంట్రాక్టర్ నిర్మాణం చేపట్టి పూర్తి చేశాడు. ఈ క్రమంలోనే మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్‌ను కేసీఆర్ బర్తరఫ్ చేశారు. ఆ తర్వాత హుజూరాబాద్‌కు ఉప ఎన్నిక వచ్చింది. ఆ సమయంలో అప్పటి మంత్రులు హరీష్‌రావు, గంగుల కమలాకర్ పేద ప్రజలకు ఇళ్లు ఇస్తామని, అర్హులైన వారు తహసీల్దార్‌కు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దీంతో సుమారు ఐదు వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎవరికీ ఇవ్వలేదు. కొంత మంది వ్యక్తులు డబుల్ బెడ్‌రూం ఇళ్లనే అడ్డాగా చేసుకుని అసాంఘిక కార్యక్రమాలు చేపడుతున్నారు. కిటికిలు, తలుపులు, విద్యుత్ వైర్లు, డ్రైనేజీలను ధ్వంసం చేశారు. అసెంబ్లీ ఎన్నికలు కాగానే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి మరోసారి దరఖాస్తులు స్వీకరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల గురించి పట్టించుకున్న వారే కరవయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా లబ్ధిదారులను ఎంపిక చేసి డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించేనానని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

హుజూరాబాద్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు



# స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి

- డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 22: స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీ శ్రేణులకు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. శనివారం సాయంత్రం గాంధీ భవన్‌లో పార్టీ జిల్లాల అధ్యక్షులు, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును పొందలేని కుటుంబాలను గుర్తించి వారితో సంబంధిత అధికారులకు దరఖాస్తులు చేయించాలని ఆయన సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరలో చేపట్టబోతున్నారని, ఇక నుంచి గ్రామస్థాయిలో ఏర్పాటు చేయనున్న ఇందిరమ్మ కమిటీల ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఆ కమిటీల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు చోటు దక్కించుకునేందుకు కృషి చేయాలన్నారు. ఇందిరమ్మ కమిటీల్లో స్థానం పొందడం వల్ల గ్రామంలో అర్హులైన వారిని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా ఎంపిక చేసే అవకాశం లభిస్తుందని, తద్వారా అర్హులైన ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన తెలిపారు.

## జీవో 25ను రద్దు చేయాలి

జమ్మికుంట రూరల్ సెప్టెంబరు 22: రాష్ట్ర ప్రభుత్వం జీవో 25ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను రక్షించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి డిమాండ్ చేశారు. జమ్మికుంట పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీవో 25ను తీసుకువచ్చి పాఠశాల ఉపాధ్యాయులను సర్దుబాలు ప్రక్రియ మొదలు పెట్టిందన్నారు. జీవో ప్రకారం 1నుంచి10 మంది పిల్లలు ఉంటే ఒక ఉపాధ్యాయుడు 11-60కి ఇద్దరు, 61-90కి ముగ్గురు, 91-120 నలుగురు, 121-150 ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉంటుందన్నారు. 60మంది పిల్లలు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులు పని చేయాలంటే ఎలా సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏబూషి శ్రీనివాస్, సదానందం, సంపత్, ఉమ, ఎం శ్రీనివాస్, బలరాం, కనకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజికి మృతదేహం అప్పగింత

వీణవంక, సెప్టెంబర్ 22: మండలంలోని కొండపాక గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ అవాల మణెమ్మ (80) అనారోగ్యంతో మృతి చెందింది. 2014లో కొండపాక ఎంపీటీసీగా పని చేసింది.కు 'టుంబ సభ్యులు మణెమ్మ కోరిక మేరకు అర్‌వీఎం మెడికల్ కళాశాలకు అప్పగించారు. మణెమ్మ కుటుంబసభ్యులను ఎంపీ ఈటల రాజేందర్ ఫోన్‌లో పరామర్శించారు. పలువురు నాయకులు మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

## పిడుగుపాటుకు గేదె మృతి



మృతి చెందిన గేదె వద్ద రైతు

తిమ్మాపూర్, సెప్టెంబరు 22: మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామంలో ఆదివారం పిడుగుపడి అలువాల గంగయ్య అనే రైతుకు చెందిన గేదె మృతి చెందింది. మృతి చెందిన గేదె సుమారు 70వేల రూపాయల విలువ ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు గంగయ్య విజ్ఞప్తి చేస్తున్నాడు.



# క్షమాభిక్షతో అక్రమ వలసదారులకు ఊరట

- జరిమానా రద్దుచేసిన యూఏఈ - 22రోజుల్లో అవుట్ పాస్‌పోర్ట్‌కోసం వేలాది దరఖాస్తులు
- భారత రాయబార కార్యాలయాల వద్ద పెరిగిన రద్దీ



సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 22: యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో ఇటీవల ప్రకటించిన క్షమాభిక్షతో అక్రమ వలసదారులకు ఊరట లభించింది. ఈ సందర్భంగా యూఏఈని అక్రమవలసదారులకు విధించే జరిమానాను రద్దు చేసింది. ఈనెల 1నుంచి అమ్నెస్టీ ప్రకటించిన 22రోజుల్లో దాదాపు 20 వేలకు పైగా అక్రమవలసదారులు అవుట్‌పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేశారని జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ రెసిడెన్సీ అండ్ ఫారిన్ ఎఫైర్స్(జీడీఎఫ్‌ఆర్‌ఏ) వెల్లడించింది. దీంతో దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయాల వద్ద రద్దీ పెరిగింది. ఇప్పటికే అనేకమంది అవుట్‌పాస్‌పోర్ట్ తీసుకొని ప్రవాస తెలంగాణ కార్మికులు దుబాయ్‌నుంచి తిరుగుముఖం పడుతున్నారు.

**● 20వేల మంది..**

దుబాయ్‌లో తెలంగాణకు చెందిన దాదాపు 20 వేలమంది అక్రమ వలసదారులు ఉండవచ్చని భారత రాయబార కార్యాలయం అంచనా వేసింది. ఇందులో సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, నిజామాబాద్, ఆర్మూర్, నిర్మల్, కామారెడ్డి, ఆదిలాబాద్, మెదక్ తదితర ప్రాంతాలకు చెందిన కార్మికులు ఎక్కువగా ఉంటారు. కేవలం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన దాదాపు అయిదువేల మంది కార్మికులు వీసా లేకుండా చాటుమాటుగా పనులు చూసుకుంటూ కాలం గడుపుతున్నారు. క్షమాభిక్ష కారణంగా అక్రమ వలసదారులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. అయిదేళ్ల తర్వాత యూఏఈ ప్రభుత్వం మళ్లీ అవకాశం కల్పించింది. ఈసారి గడువు రెండు నెలలు ఇవ్వడంతో అనేకమంది తిరిగి వచ్చే అవకాశం ఉంది.

**● టికెట్ కోసం కార్మికుల ఆశలు...**

దుబాయ్‌లో అక్రమంగా ఉంటున్న వలస కార్మికులకు టికెట్‌కు డబ్బులు లేక తిరిగి వచ్చేందుకు ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. అక్రమంగా ఉంటున్న ప్రవాస కార్మికులందరికీ టికెట్‌లు స్పాన్సర్ చేయాలని దుబాయ్‌లోని గల్ఫ్ కార్మికులు కోరుతున్నారు. అక్రమవలసదారులు ఎమర్జెన్సీ సర్టిఫికెట్ కోసం 60 దిర్హామ్‌లు, సర్వీస్ ఫీజు 9 దిర్హామ్‌లు చెల్లించనవసరం లేదని ఇండియన్ కౌన్సులేట్ జనరల్ ఇప్పటికే ప్రకటించింది. దీంతో అక్రమ వలసదారులకు కొంత భారం తగ్గినట్లయింది. ఇదేవిధంగా తిరిగి రావడానికి అయ్యే విమాన ఖర్చులను చెల్లించాలని దుబాయ్‌లోని పలు యూనియన్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఇప్పటివరకు అనేకమంది అక్రమ వలసదారులు వారి కుటుంబసభ్యుల ద్వారా దుబాయ్‌లో ఉండే స్నేహితులకు డబ్బులు పంపించి టికెట్ తీసుకుంటున్నారు. టికెట్‌కు డబ్బులు పంపించలేని కార్మికులకు టికెట్ ఇప్పిస్తారని ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.

## జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ ఎంపికలు

హుజూరాబాద్, సెప్టెంబరు 22: ఈ నెల 23, 24న జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ సెలక్షన్స్ హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సొల్లు సారయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న అండర్-17 బాలబాలికలు, 24న అండర్-14 బాలబాలికలకు కబడ్డీ సెలక్షన్స్ జరుగుతాయని పేర్కొన్నారు. పాల్గొనే క్రీడాకారులు మండల కబడ్డీ జట్టు ప్రారంభ కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని తెలిపారు. ప్రతి టీమ్ కూడా వారి మండల ప్లాగ్, అర్హత ఫామ్, ఆధార్‌కార్డు జిరాక్స్ జతచేసి ఉదయం 9గంటలకు హుజూరాబాద్ హైస్కూల్ గ్రౌండ్‌లో హాజరు కావాలని కోరారు.

## ఊర చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లెల జగన్మోహన్

గన్నేరువరం, సెప్టెంబరు 22: మండల కేంద్రంలోని ఊర చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లెల జగన్మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామస్థులతో కలిసి చెరువు వద్ద మీడియాతో మాట్లాడారు. గన్నేరువరం చెరువు ఏళ్ల తరబడి ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. చెరువు పక్కనే మానేరు డ్యాం, గుట్టలు, ప్రకృతివనం ఆహ్లాదకరంగా ఉన్నప్పటికీ చెరువు కట్ట అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. కట్టపై పిచ్చి మొక్కలతో నిండి వాహనాల ప్రయాణానికి సైతం ఇరుకుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవచూపి చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కాంతాల అంజిరెడ్డి, పుల్లెల రాము, కొట్టె భూమయ్య, ఐలయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ లైన్‌పై విరిగిపడ్డ హైమాస్ట్ లైట్ల స్తంభం

**● నిలిచిపోయిన విద్యుత్**

శంకరపట్నం, సెప్టెంబరు 22: శంకరపట్నం మండలం ముత్తారం గ్రామంలో విద్యుత్ ఎల్టీ లైన్‌పై హైమాస్ట్ లైట్ల స్తంభం విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ముత్తారం రామాలయం వెనుక హైమాస్ట్ లైట్ల కోసం ఏర్పాటు చేసిన స్తంభం ఆదివారం రాత్రి వీచిన గాలికి ఆకస్మాత్తుగా విరిగి విద్యుత్ లైన్‌పై పడిపోయింది. దీంతో కన్నాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సుమారు గంటన్నర పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది విరిగిపడ్డ స్తంభాన్ని తొలగించి విద్యుత్ లైన్ పునరుద్ధరించి తిరిగి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

## మున్సిపల్ అధికారుల దాడులు

- ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం.. జరిమానాల విధింపు



పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల, సెప్టెంబరు 22: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న చికెన్, మటన్ దుకాణాల్లో మున్సిపల్ అధికారులు ఆదివారం సోదాలను నిర్వహించారు. దుకాణాల్లో ఉన్న ప్లాస్టిక్ నిల్వను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. ప్లాస్టిక్ కవర్లు వాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని ప్రతీ దుకాణదారులకు రూ. 2500 జరిమాన విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరుపతి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. కొనుగోలుకు వచ్చే వినియోగదారులు బట్ట సంచులతో రావాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలే అశోక్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇప్పపల్లి-పోతారం అడవుల్లో సరిహద్దు వివాదం

- ఎటూ తేల్చని అటవీ, రెవెన్యూ శాఖలు
- ఏడాది కాలంగా గొడవలు
- నిత్యం యంత్రాలతో యథేచ్ఛగా అడవి ధ్వంసం



ధ్వంసమైన అడవిలో చదును చేసిన స్థలం

కథలాపూర్, సెప్టెంబరు 22: మండలంలోని ఇప్పపల్లి - పోతారం అటవీ, రెవెన్యూ సరిహద్దు వివాదం రోజురోజుకూ రాజుకుంటోంది. ఈ క్రమంలో అడవి నిత్యం విచ్చలవిడిగా నరికివేతకు గురవుతున్నా రెండు శాఖలు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ భూమి తమకే చెందుతుందని శివారు మాదేనని ఇరు గ్రామాల ప్రజలు అడవి తల్లిపై గొడ్డలి వేటు వేస్తున్న నేపథ్యంలో వందలాది ఎకరాలు ధ్వంసానికి గురవుతున్నాయి.

**- రాత్రి, పగలు తేడా లేకుండా..**

రాత్రి, పగలు యథేచ్ఛగా యంత్రాలతో భూమిని చదును చేస్తుండగా అటవీ శాఖ కళ్లుండీ చూడలేక పోతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోటా పోటీగా రెండు గ్రామాలకు చెందిన వ్యక్తులు పోడుకు ప్రయత్నిస్తూ ఒకరిపైనొకరు అటవీ శాఖ కు ఫిర్యాదులు చేసుకోవడం సర్వసాధారణంగా మారిపోయింది. ఇప్పటికే ఏడాది కాలంగా అడవుల ధ్వంసంపై గొడవలు జరుగుతుండగా పోలీసు యంత్రాంగం పలుమార్లు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని ఇరువర్గాలకు సముదాయించిన ఘటనలు కూడా ఉన్నాయి. పోతారానికి చెందిన ఓ సామాజిక వర్గం తమకు శ్మశాన వాటికకు స్థలం కావాలంటూ చెట్లను ఇబ్బడిముబ్బడిగా నరికివేస్తుండగా ఇప్పపల్లి వాసులు అడ్డుకుంటున్నారు. ఈ శివారు తమకే వర్తిస్తుందని అడవిని కాపాడుకుంటామని అటవీశాఖకు చెందిన అధికారులతో ఇటీవల వాదించారు. గడిచిన ఏడాది కిందట ఇప్పపల్లి వాసులు అడవిని యం త్రాలతో ధ్వంసం చేశారని పేర్కొంటూ అటవీ శాఖ అధికారులు రు 2 లక్షల జరిమానా విధించారు. వారం రోజుల కిందట అటవీశాఖ ఉన్నతాధికారులు ఇప్పపల్లిలో సమా వేశం ఏర్పాటు చేయగా అటవీ, రెవెన్యూ సరిహ ద్దులు తేల్చాలని డిమాండ్ చేశారు. అయితే రెవెన్యూ, అటవీ శాఖల సమన్వయం లేకపోవడం వల్ల సరిహద్దు వివాదం చిలికి చిలికి గాలివానలా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ కారణంగానే భారీ విస్తీర్ణంలో అడ వి ధ్వంసం కాబడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



నరికి వేసిన చెట్లు

## బీసీ కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

**- బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్**



మాట్లాడుతున్న ఎన్నం ప్రకాష్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 22: బీసీ కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని పద్మావతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 25న హైదరాబాద్‌లో సుందరయ్య పార్క్ నుంచి ఇందిరాపార్క్ వరకు తలపెట్టిన కులగణన మార్చ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హైకోర్టు తీర్పుతో నైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కుల గణనను ప్రారంభించడానికి రోడ్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వెంటనే కుల గణనను చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు సంపత్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గీకురు రవీందర్, రాష్ట్ర కార్యదర్శి కోడూరి పరుశురామ్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి జి ఎస్ ఆనంద్, బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజురాకేశ్‌చారి, కనకయ్య గౌడ్, రాచమల్ల రాజు,దొగ్గలి శ్రీధర్, పెంట శ్రీనివాస్, ఎడ్ల సురేందర్, వంగల రవి గోపాల్, మాచర్ల అంజయ్య గౌడ్, మాదాసు సంజీవ్, కాయితోజు బ్రహ్మచారి, సుధాగోణి గణేశ్‌గౌడ్, బియ్యాని తిరుపతి, తాళ్లపల్లి మహేష్, తదితరులు పాల్గొన్నారు.



ఓసీపీ-5 పీఎల్‌ఆర్ కంపెనీ నుంచి తరలివెళుతున్న స్థానికేతరులు

## రామగుండంలో 'స్థానిక' వివాదం

- ఓపెన్‌కాస్టు నుంచి తరలివెళ్లిన స్థానికేతరులు
- రెండు ఓబీ కంపెనీల్లో వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు

గోదావరిఖని, సెప్టెంబరు 22: రామగుండంలో స్థానిక నినాదం భగ్గుమన్నది. ఆర్‌జీ-1 పరిధిలోని రామగుండం నియోజకవర్గ పరిధిలోని ఓసీపీ-5, ఓసీపీ-3 రెండు ఓపెన్‌కాస్టుల్లో ఓబీ కాంట్రాక్టర్ల వద్ద 1200మంది కార్మికులు పనిచేస్తారు. ఇందులో 80శాతం స్థానికేతరులే ఉంటారు. వీరంతా ఒరిస్సా, బీహార్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి ఈ కాంట్రాక్టు కంపెనీల్లో పనిచేస్తుంటారు. ఓబీ పనుల్లో వోల్వో డ్రైవర్లుగా, టెక్నీషియన్లుగా ఇతర రాష్ట్రాల నుంచి ఉద్యోగులను తీసుకువచ్చి ఓపెన్‌కాస్టులపైనే ఓబీ కంపెనీలు గుడారాలు వేసి పని చేయిస్తుంటారు. పని స్థలాల్లో వీరు ఉండడం వల్ల పూర్తి పని సమయాల్లో కాంట్రాక్టర్లు వాడుకుంటారు. జీతాల చెల్లింపుల్లో కూడా ఓబీ కాంట్రాక్టర్లకు ప్రయోజనం ఉంటుంది. ఇది ఎన్నో ఏళ్లుగా జరుగుతున్న ప్రక్రియ, మార్పు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తాను గెలిస్తే ఇక్కడ పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి పెంచుతామని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ చెప్పిన విధంగానే ఇప్పుడు ఆచరణ మొదలైంది. నెల రోజుల క్రితం ఓసీపీ-3 ప్రాజెక్టులో ఆర్‌వీఆర్ కంపెనీ ఓబీ కాంట్రాక్టర్ దగ్గర 600మంది పని చేస్తుంటారు. ఇందులో 500మంది స్థానికేతరులే. స్థానికులనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని, లేకుంటే పని బంద్ చేయాలని ఎమ్మెల్యే ఆదేశాలతో 25రోజులు గత నెలలో ఆర్‌వీఆర్ ఓసీపీలో పనులు బంద్ అయ్యాయి. చివరికి 80మంది స్థానికులనే ఉద్యోగాల్లో తీసుకుంటామని, కార్మిక చట్టాల జీవో అమలుచేస్తామని హామీ ఇవ్వడంతో తిరిగి ఆర్‌వీఆర్ పనులు కొనసాగుతున్నాయి. ఈ స్ఫూర్తితో వారంరోజుల క్రితం స్థానిక కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సూచన మేరకు ఓసీపీ-5లోని పీసీ పటేల్ ఓబీ కాంట్రాక్టు పనులను కూడా బంద్ చేయించారు. ఈ అంశం డైరెక్టర్లు, సీఎండీ వరకు వెళ్లింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఓసీపీ-5లో కూడా 80శాతం మంది స్థానికులనే ఉద్యోగులుగా తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పీసీ పటేల్ కంపెనీలో పని చేసే సుమారు 600మంది స్థానికేతర కార్మికులు ఆదివారం తమ తమ ఊళ్లకు వెళ్లిపోయారు. దీంతో ఓసీపీ-5 పీసీ పటేల్ కంపెనీలో, ఓసీపీ-3 ఆర్‌వీఆర్ ఓబీ కంపెనీలో సుమారు 1000మంది స్థానికులకు ఉద్యోగాలు లభించే అవకాశం ఏర్పడింది. ఈ పరిణామం పట్ల స్థానిక నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బెంబేలెత్తిస్తున్న కుక్కలు

- గుంపులుగా వీధుల్లో సంచారం
- ప్రజలు, మూగజీవాలపై దాడులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 22: వీధికుక్కల దాడుల వరుస సంఘటనలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కొన్ని రోజులుగా ప్రతిరోజూ ఏదో ఒక చోట వీధి కుక్కలు పిల్లలు, పెద్దలు, మహిళలపై దాడుల చేసి తీవ్రంగా గాయపరుచడంతో ప్రజలు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట, పెద్దూర్, సర్ధాపూర్, రగుడు, చిన్నబోనాల, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, పెద్దబోనాల, దూప్యానాయక్ తండా, తుర్కాకాశీపల్లె, జగ్గారావుపల్లె, మాలపల్లె, బాబాజీ కాలనీ, ఇప్పల్లపల్లెలో కుక్కలు చెలరేగిపోతున్నాయి. దీంతో ఇళ్లలో నుంచి బయటకు రావడానికి మహిళలు, చిన్న పిల్లలు భయపడుతున్నారు. మూగజీవాలకు కూడా రక్షణ లేకుండా పోయింది. వీధుల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. ఇటీవల పెద్దూర్‌లోని పలువురు చిన్న పిల్లలపై దాడి చేసి గాయపర్చాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సిరిసిల్ల జిల్లా పెద్దూర్‌లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు



**కుక్కలతో అవస్థలు..**

పెద్దూర్‌లో కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో అవస్థలు పడుతున్నాం. ప్రజలపై దాడులు చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. జనం వీధుల్లో తిరగలేని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- ఉలిసె తిరుపతి, పెద్దూర్



**జనం భయపడుతున్నారు..**

రోడ్లపై కుక్కల గుంపులతో గ్రామాల్లో జనం భయపడుతున్నారు. కుక్కల దాడితో చాలా మంది గాయపడుతున్నారు. బయటకు రావాడానికి జనం వణికిపోతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలి.

- జీలకిషన్‌యాదవ్, సింగిల్ విండో చైర్మన్

## నామాపూర్‌లో గంజాయి పట్టివేత

**- ముగ్గురి అరెస్టు**

పెగడపల్లి, సెప్టెంబరు 22: మండలంలోని నామాపూర్ గ్రామ శివారులో ఆదివారం గంజాయి సేవిస్తున్న ముగ్గురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పెగడపల్లి ఎస్‌ఐ రవికిరణ్ తెలిపారు. నామాపూర్ గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రదేశంలో గంజాయి సేవిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది తిరుపతి, రాజేష్, సంపత్, ఎల్లయ్యలు ఒక బృందంగా ఏర్పడి గంజాయి సేవిస్తున్న తోడేటి వెంకటేష్ ధర్మపురి మండలం తిమ్మాపూర్, బుగ్గారం మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన లింగాల వంశీ, చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన గుండేటి ప్రవీణ్‌లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 500 గ్రాములు గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్‌లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్‌ఐ రవికిరణ్ తెలిపారు. గంజాయి విక్రయించినా, సేవించినా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## నాటుబాంబుల తయారీ ముఠా అరెస్టు

కోనరావుపేట, సెప్టెంబరు 22: నాటుబాంబుల తయారీ ముఠాను పోలీసులు అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం వివరాలను వెల్లడించారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన ముడిక మల్లయ్యకు చెందిన గేదె మేత మేస్తూ గడ్డిలో ఉన్న నాటుబాంబును కొరకడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధిత రైతు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ధర్మారం గ్రామానికి చెందిన పిట్టల రాజలింగం, బోనాలకు చెందిన తుమ్మల కనకరాజు, పడగల లక్ష్మీరాజం నాటు బాంబులను తయారు చేస్తూ అడవి జంతువులను వేటాడుతున్నట్లు తేలింది. వారి వద్ద 27 నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పిట్టల రాజలింగంను గతంలో రిమాండ్ పంపినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో కోనరావుపేట ఎస్సై రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.




వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

## దాడి చేయడంతో మనస్తాపం ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

చందుర్తి సెప్టెంబరు 22: చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన సూత్రం ఆంజనేయులు (22) అనే యువకుడు ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నర్సింగాపూర్‌కు చెందిన ఆంజనేయులు తమ కుటుంబ అంతర్గత విషయాల్లో జోక్య చేసుకోవద్దని అదే గ్రామానికి చెందిన ఆరుగురు దాడి చేశారు. దీంతో మనస్తాపం చెంది ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో రేకుల పెడ్డుకు ఉరేసుకున్నాడు. ఆంజనేయుఉల తల్లి రాజవ్వ ఫిర్యాదుతో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బాబు తెలిపారు.

## కుక్కలు అడ్డురావడంతో అదుపుతప్పిన బైక్ ఇద్దరికి గాయాలు

రుద్రంగి, సెప్టెంబరు 22: మండల కేంద్రంలో ఆదివారం బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. కథలాపూర్ మండలం కలికోటకు చెందిన దేవరాజం ద్విచక్ర వాహనంపై చందుర్తి మండలం మల్యాల నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. రుద్రంగిలోని ఇందిరాచౌక్ వద్ద కుక్కల గుంపు బైక్ వైపు రావడంతో అదుపుతప్పి కింద ఎడ్డాడు. దేవరాజం కాలు విరిగింది. బైక్ వెనకాల కూర్చున్న మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వేములవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## దేవుడి సొమ్ము విక్రయించే యత్నం

**- స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగింత**

కోల్‌సిటీ, సెప్టెంబరు 22: రామగుండం విద్యుత్‌నగర్‌లో హనుమాన్ టెంపుల్‌లో కిలోకుపైగా వెండి ఆభరణాలు చోరీ చేసి ఆ సొత్తును గోదావరిఖని స్వర్ణకారులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా ఆదివారం స్వర్ణకారులు ఇచ్చిన సమాచారంతో రామగుండం వాసులు పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. రామగుండం విద్యుత్‌నగర్‌లోని హనుమాన్‌దేవాలయంలో రెండు రోజుల క్రితం చోరీ జరిగింది. దేవునికి అలంకరించిన కిలో వెండివస్తువులు, కొంత బంగారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆదివారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని ఒక స్వర్ణకారుడిని సంప్రదించిన దొంగలు తాము వెండి వస్తువులు తీసుకువస్తామని చెప్పారు. చోరీ జరిగిన సమాచారం ఉన్న సదరు స్వర్ణకారుడు రామగుండంలోని అతని సోదరునికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆలయ పూజారితో పాటు కాలనీవాసులు ఆదివారం లక్ష్మీనగర్‌లో కాపుకాశారు. సదరు దొంగ ఆభరణాలతో రాగానే పట్టుకున్నారు. అతడిని గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

## కొడుకుకు గడ్డిమందు తాగిచ్చి హత్యాయత్నం

**- వివాహేతర సంబంధం బయటపడుతుందని ప్రియుడితో కలిసి ఘాతుకం**

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 22: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి రూరల్ మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో ఓ తల్లి తన వివాహేతర సంబంధం బయటపడుతుందని ప్రియుడితో కలిసి కన్న కొడుకుకు గడ్డి మందు ఇచ్చి చంపాలని చూసింది. ఈ ఘటన 20 రోజుల క్రితం జరగగా దుబాయిలో ఉన్న తండ్రికి విషయం తెలియడంతో స్వగ్రామానికి చేరుకుని మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. జగ్గసాగర్ గ్రామంలో ఉంటున్న ఓ వ్యక్తి జీవనోపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం గల్ఫ్ వెళ్లాడు. అతని భార్య, కుమారుడు గ్రామంలో ఉంటున్నారు. గ్రామంలోని మరో వ్యక్తితో సదరు మహిళ కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ప్రియుడితో మహిళ కలిసి ఉండటాన్ని కుమారుడు ఒకరోజు చూసాడు. దీంతో తన బండారం బయటపడుతుందని కొడుకును అడ్డు తొలగించుకోవాలని ఆమె నిర్ణయించుకుంది. వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తితో కలిసి మహిళ తన కొడుకుకు ఈనెల 2వ తేదీన బలవంతంగా గడ్డి మందు తాగించింది. అనుమానం రాకుండా ఉండేందుకు ఆరోగ్యం బాగా లేదని గ్రామంలోని ఆర్ ఎంపీతో మూడు రోజులు చికిత్స చేయించింది. పరిస్థితి విషమించడంతో మెట్‌పల్లిలోని ఆసుపత్రికి తరలించింది. వైద్యులు పరీక్షలు చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించాలని సూచించారు. ప్రస్తుతం నిజామాబాద్‌లో ప్రాణాపాయ స్థితిలో యువకుడు చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న యువకుడి తండ్రి గల్ఫ్ నుంచి ఇటీవల వచ్చి అసలు విషయం ఏంటని ఆరా తీశాడు. భార్య విషయం బయటపడడంతో ఆదివారం మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దరాప్తు చేస్తున్నారు.

## గోదావరిలో మృతదేహం లభ్యం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 22: గోదావరినదిలో ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి మృతదేహం లభించినట్లు గోదావరిఖని టుటౌన్ పోలీసులు తెలిపారు. మృతుడు మంచిర్యాల జిల్లాకు చెందిన సాటం వెంకటేష్(32)గా గుర్తించినట్లు పేర్కొన్నారు. మృతుడు మంచిర్యాలటౌన్‌లో ఇంటర్‌నెట్ షాపు నడుపుకుంటూ జీవిస్తుంటాడని, ఓ హత్య కేసులో జైలుకు వెళ్లి వారం రోజుల క్రితం కండీషన్ బెయిల్‌పై వచ్చిన అతడు నదిలో మృతదేహంగా మారినట్టు తెలిపారు. వెంకటేష్ ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా హత్య చేసి ఉంటారా అనేది తేలాల్సి ఉందని, ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. మృతుడి బంధువుల్లో ఒకరు మృతదేహాన్ని చూసి వెంకటేష్‌గా గుర్తించారన్నారు.

## ఇళ్ల చుట్టూ ఎస్సారెస్పీ కెనాల్ నీళ్లు



ఇంటి చుట్టూ చేరిన కెనాల్ నీళ్లు

మంథనిరూరల్, సెప్టెంబరు 22: మండలంలోని కన్నాల గ్రామంలో ఎస్సారెస్పీ కెనాల్ నీళ్లు ఇళ్ల చుట్టూ వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో పూడిక పూడిక పెరుకుపోవడంతో నీళ్లు ఇళ్ల మధ్యకు వస్తున్నాయి. జంగిలి బుజ్జమ్మ, జంగిలి రాధమ్మతో పాటు పలువురి ఇళ్లల్లోకి నీరు రావడంతో ఇబ్బందులు పడుతున్నారు.

## డ్రైవర్ విధులకు ఆటంకం కలిగించిన ఆర్‌ఎంపీపై కేసు నమోదు

**- ఆర్టీసీ బస్సు ఇంటి వద్ద ఆపలేదని వివాదం**



పోలీస్‌స్టేషన్ ఎదుట నిలిపిన ఆర్టీసీ బస్సు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 22: ఆర్టీసీ బస్సు డ్రైవర్ విధులకు ఆటంకం కలిగించిన మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ తాడూరి రాజేశంపై కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం కరీంనగర్ నుండి ఇల్లంతకుంట మీదుగా జేబీఎస్‌కు ఆదివారం బయలుదేరింది. ఇల్లంతకుంటలోని బస్టాండులో రాజేశం బస్సు ఎక్కి మార్గమధ్యలోని తన ఇంటివద్ద ఆపాలని కోరాడు. డ్రైవర్ ఇంటివద్ద కొంత సమయం బస్సును ఆపినా ఇంట్లోని వారు రాకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారని డ్రైవర్ తెలిపాడు. దీనితో ఆవేశానికి లోనైన రాజేశం డ్రైవర్‌ను దుర్భాషలాడుతూ దాడి చేసేందుకు వెళ్లాడు. డ్రైవర్ ఆర్టీసీ బస్సును తీసుకొని నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. డ్రైవర్ శెట్టి తిరుమలరాజు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 22: కరీంనగర్‌లోని రాజీవ్ చౌక్ వద్ద న్యూ పీకాక్ రెస్టారెంట్‌లో ఆదివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. రెస్టారెంట్‌లోని కిచెన్‌లో చిమ్ని వద్ద పెద్దఎత్తున పొగలు రావడంతో సిబ్బంది వెంటనే కరీంనగర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో ఫైర్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సంఘటనలో 2 లక్షల రూపాయలకు పైగా నష్టం వాటిల్లినట్టు కరీంనగర్ డివిజన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అగ్నిప్రమాద ఘటనపై విచారణ జరుపుతున్నామని ఆయన తెలిపారు.




మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

## బస్సులో రూ. 2 లక్షలు మర్చిపోయిన ప్రయాణికుడు

**- అందజేసిన మంథని డీఎం శ్రావణ్‌కుమార్**



రమేశ్‌కు డబ్బులు అందజేస్తున్న డీఎం శ్రావణ్‌కుమార్

మంథని, సెప్టెంబరు 22: ఆర్టీసి బస్సులో ప్రయాణికుడు మర్చిపోయిన రూ. 2 లక్షలను మంథని డీఎం శ్రావణ్‌కుమార్ ఆదివారం అప్పగించారు. మంథని డిపోకు చెందిన బస్సు గోదావరిఖని నుంచి భూపాలపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో కాటారంలో జే రమేశ్ అనే ప్రయాణికుడు ఎక్కాడు. ఈక్రమంలో తన వెంట ఉన్న కవర్‌లో రూ. 2 లక్షలను సీటులోనే ఉంచి మర్చిపోయి భూపాలపల్లిలో దిగిపోయాడు. డబ్బులను గమనించి భూపాలపల్లి డిపోలో సెక్యూరిటీ సిబ్బందిని కలిసి సమాచారం ఇచ్చారు. వారు మంథని డీఎంకు సమాచారం ఇవ్వడంతో బస్సును గుర్తించి కండక్టర్ ద్వారా సదురు నగదు ఉన్న కవర్‌ను గుర్తించి తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. ఈమేరకు సమాచారం ఇవ్వడతో రమేశ్ మంథనికి వచ్చి తన రూ. 2 లక్షల నగదు కవర్‌ను డీఎం శ్రావణ్‌కుమార్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. మర్చిపోయిన తన రూ. 2 లక్షలను తిరిగి క్షేమంగా అప్పగించిన డీఎం శ్రావణ్‌కుమార్, కండక్టర్ తిరుపతమ్మ, డ్రైవర్ మొగిలికి రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఆదమరిస్తే అంతే..

- వల్లంపహాడ్, ఇరుకుల్ల బ్రిడ్జిలపై ప్రమాదకరంగా గుంతలు
- రాకపోకలకు వాహనదారులు అవస్థలు



ఇరుకుల్ల వంతెనపై తేలిన ఇనుప చువ్వలు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 22: కరీంనగర్ శివారులోని ప్రధాన రహదారిపై రోడ్లు అధ్వాన్నంగా మారాయి. కరీంనగర్ మండల శివారులోని ప్రధాన రాజీవ్ రహదారిపై, కరీంనగర్ నుంచి మంచి ర్యాల ప్రధాన రహదారి వల్లంపహాడ్ బ్రిడ్జిపై రహదారి ప్రమాదకరంగా మారింది. ఇరుకుల్ల వంతెనపై పలు చోట్ల గుంతలు ఏర్పడి తరచూ ప్రవ మాదాలు జరుగుతున్నాయి. కరీంనగర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్లే రహదా రిపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వల్లంపహాడ్ బ్రిడ్జి మూల వద్ద ఏర్పడిన భారీ గుంత ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు సేఫ్టీ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వల్లంపహాడ్ బ్రిడ్జి బ్రిడ్జిపై, ఇరుకుల్ల బ్రిడ్జి రహదారిపై మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత



వల్లపహాడ్ బ్రిడ్జిపై ప్రమాదకరంగా ఉన్న గుంత

## దేశ అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం


మాట్లాడుతున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు22: భారత దేశ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమని అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల ఆవరణలో అల్ఫోర్స్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దేశాభివృద్ధికిమూలమన్నారు. ఎందరో మహానుభావులు పుట్టిన దేశంలో విద్యార్థులు సమాజాభివృద్ధికికృషి చేయాలన్నారు. దేశ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి చరిత్రలో నిలిచి పోవాలన్నారు. ఈ సదస్సులో టీవీ సీరియల్ నటుడు కెవి ప్రదీప్‌కుమార్, విద్యావేత్త డాక్టర్ కెప్టెన్ బి మధుసూదన్‌రెడ్డి, ఇసిజి ఫౌండర్ శివప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్ఎండీ ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 22: లోయర్ మానేరు డ్యాం ముంపు గ్రామాల బాధితులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్‌ను కలిసి తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించాలని కోరారు. ముంపు బాధితులకు జీఓ 98 ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పించేలా తగు చొరవ తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. ఇటీవల జలసౌధలో జరిగిన సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇరిగేషన్ శాఖలో 1,800 లస్కర్ పోస్టులకు గాను ఆర్థిక శాఖ అనుమతి కోసం పంపించినట్లు సమాచారం ఉందని తెలిపారు. ఈ విషయాన్ని ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ల దృష్టికి తీసుకెళ్లి ముంపు బాధితులకు ఉద్యోగాలు కల్పించేలా తగు చొరవ తీసుకుంటానని పురుమల్ల శ్రీనివాస్ హామి ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో లోయర్ మానేరు ముంపు గ్రామాల బాధితులు వరాల శ్రీనివాస్, గసికంటి అనిల్, టి.వి స్వామి, వెన్నం వేణు, జెల్ల సతీష్, లక్ష్మణ్, రాజు, చిరంజీవి, చందు, పాల్గొన్నారు.

## కళాసిల్క్ చేనేత, హస్తకళా ప్రదర్శనకు స్పందన


స్టాల్స్‌లో చీరలను కొనుగోలుచేస్తున్న మహిళలు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు22: నగరంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన, అమ్మకాలకు వినియోగదారుల నుంచి చక్కటి స్పందన లభిస్తోంది. పట్టు, ఫ్యాన్సీ, పోచంపల్లి చీరలు, డ్రెస్ మెటీరియల్స్ చుడీదార్స్, సూటింగ్స్, షర్టింగ్స్, జువెల్లరీ, బెడ్ షీట్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకుడు వినోద్ జైన్ తెలిపారు. ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడల్లో ప్రఖ్యాతి పొందిన చీరలకు మహిళలు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని చెప్పారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈనెల 24న గోదావరిఖని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో మా కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభమవుతుందని నిర్వాహకుడు వినోద్ జైన్ తెలిపారు.

## మానేరు కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 22: నగరంలోని మానేరు కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి పైపులైన్, వీధిదీపాల ఏర్పాటు చేయడం వంటి మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తానని డివిజన్ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ హామీ ఇచ్చారు. ఆదివారం మానేరు కాలనీవాసుల సమావేశానికి ఆయన హాజరై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విజయదశమి (దసరా) పండుగ సందర్భంగా శ్రీదుర్గామాత నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని తీర్మానిం చారు. రోడ్ నెంబర్ 8లో మంచినీటి పైపులైను, సీసీ రోడ్డు, కాలనీలో ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్, రోడ్ నెంబర్ 1 నుంచి 7వరకు అసంపూర్తిగా వదిలిన డ్రైనేజీల నిర్మాణాలు, ప్రతి నాలుగు రోడ్ల జంక్షన్లలో మినీ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించాలని కోరుతూ వారు తీర్మానించారు. ఈసందర్భంగా వాటిని దశలవారిగా చేయిస్తానని కార్పొరేటర్ శ్రీకాంత్ హామీ ఇచ్చారు.

## అభివృద్ధి చూసి ఓర్వలేకే మంత్రిపై ఆరోపణలు

### - కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంత సుధాకర్


సమావేశంలో మాట్లాడుతున్న దొంత సుధాకర్

సైదాపూర్, సెప్టెంబరు 22: మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ మంత్రిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సైదాపూర్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్ విమర్శించారు. ఆదివారం సైదాపూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో దొంత సుధాకర్ మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ, ఎమ్మెల్యే సతీస్‌కుమార్ 10 సంవత్సరాల్లో చేయని అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ, మంత్రి పొన్నం ప్రభాకర్ చేసి చూపించాడన్నారు. బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గంలో ఖాళీ అవుందనే భయంతోనే మాజీ ఎమ్మెల్యే మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. హుస్నాబాద్ నియోజక వర్గానికి ఎనిమిది నెలల కాలంలో సుమారు రూ. 900 కోట్లకు పైగా నిధులు తీసుకవచ్చాడన్నారు. హుస్నాబాద్‌పై ఎవరికి ప్రేమ ఉందో చేసిన అభివృద్ధి చూస్తే అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదగిరి, వెల్దిరాజు, తాళ్లపెల్లి వెంకటేశం, రవి, కిషన్‌నాయక్, మండల కొమురయ్య, ఎర్రోల్ల శ్రీనివాస్, వేముల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపు మండల అధ్యక్షుడిగా బొడ్డు సునీల్

గన్నేరువరం, సెప్టెంబరు 22: మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బొడ్డు సునీల్ నియామకమయ్యారు. మున్నూరు కాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గంప వెంకన్న అధ్యక్షతన మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మండలంలోని అన్ని గ్రామాల మున్నూరుకాపు సంఘ సభ్యులు ఆదివారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొడ్డు సునీల్, గౌరవ అధ్యక్షుడిగా పురంశెట్టి బాలయ్య, ప్రధానకార్యదర్శిగా మార్గం మల్లేశం, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, సంతోష్, కార్యదర్శిగా సంపత్, పవన్‌కుమార్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటు

● ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు


తిరుమల, సత్యనారాయణరెడ్డి

రామడుగు, సెప్టెంబర్ 22: మండలంలోని గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రభుత్వం ప్రకటించింది. జనరల్ మహిళకు ఛైర్మన్ పదవి కేటా యించగా, రామడుగుకు చెందిన మాజీ ఎంపీటీసీ బొమ్మ రవేణి తిరుమల (బీసీ)కు ఛైర్‌పర్సన్ దక్కింది. ఇప్పటివరకు నాలుగు పాలకవర్గాలు ప్రకటించగా, రామడుగుకు రెండుసార్లు, గోపాల్‌రావుపేట ఒకసారి, దత్తుజీపేటకు ఒకసారి ఛైర్మన్ పదవి దక్కింది. అలాగే గోపాల్‌రావుపేటకు రెండుసార్లు వైస్ ఛైర్మన్ పదవి దక్కింది. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు పాలకవర్గం ప్రమాణస్వీకారాన్ని ఈ నెలలో ఏర్పాటు చేయడానికి కసరత్తులు చేస్తున్నారు. కాగా వైస్ ఛైర్మన్‌గా పిండి సత్యనారాయణరెడ్డి, సభ్యులుగా తొర్రికొండ నారాయణ, జక్కుల బాబు, పొన్నం కనకయ్య, బదుగు ఎల్లయ్య, పోడేటి శంకరయ్య, కంది వేణుగోపాల్‌రెడ్డి, మొలుగూరి రాజశేఖర్, పురంశెట్టి లక్ష్మణ్, మేకల కుమారస్వామి, కుంబాల రాజేశం, కట్కూరు మల్లేశం, బిక్కుమల్ల సత్యనారాయణ ఉన్నారు.

# 'ప్రజలకు బీజేపీపై విశ్వాసం'


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు22: ప్రజలకు బీజేపీపై విశ్వాసం ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని రేకుర్తి మహాలక్ష్మి గార్డెన్స్‌లో బీజేపీ మోర్చా, సెల్స్‌ల సంయుక్త కార్యశాలలో ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ మోర్చాలు, సెల్స్ క్రియాశీలకంగా పని చేయాలన్నారు. సిద్ధాంతాన్ని నమ్ముకున్న పార్టీగా ప్రపంచంలోనే బలమైన పార్టీగా బీజేపీ అవతరించిందన్నారు. ప్రపంచంలో ఏ పార్టీకి లేని విధంగా 18 కోట్ల కార్యకర్తలుకలిగిన ఏకైకపార్టీ బీజేపీ అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమల ఆంజనేయులు, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకటరెడ్డి, జిల్లాకార్యదర్శి రాపర్తి ప్రసాద్, బీజేవైఎం అధ్యక్షుడు దురిశెట్టిసంపత్, మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సోమిడి వేణుప్రసాద్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కట్ట రాజు, వివిధ మోర్చాల రాష్ట్ర బాధ్యులు ఎండి ముజీబ్, జాడి బాల్‌రెడ్డి, యువక్రాంతి, బల్బీర్‌సింగ్, అడిచెర్ల రాజు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

**●భగత్‌నగర్:** నగరంలోని 59వ డివిజన్‌లో శక్తి కేంద్ర ఇన్‌చార్జి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 163వ బూత్ అధ్యక్షుడు పబ్బుల ఆంజనేయులు, 164వ బూత్ కో-ఆర్డినేటర్ దయ్యాల కరుణాకర్, కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్, సభ్యత్వ నమోదు టౌన్ వన్ కో-కన్వీనర్ కైలాష్‌నవీన్, సోషల్ మీడియా కన్వీనర్ కటకం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

**●హుజూరాబాద్:** బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలోని 46, 48వ పోలింగ్ బూత్‌లలో మెంబర్‌షిప్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మెంబర్‌షిప్ డ్రైవ్ చేయాలని పార్టీ అధినాయకత్వం నిర్దేశించిందన్నారు. కార్యక్రమంలో మాడ గౌతమ్‌రెడ్డి, నిర్మల, కొండాల్‌రెడ్డి, రాజశేఖర్, శశిధర్, రమేష్, సమ్మయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**●జమ్మికుంట:** జమ్మికుంట పట్టణంలోని 179వ బూత్‌లో బూత్ అధ్యక్షుడు ముకుంద సుధాకర్‌పటేల్ అధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ పాల్గొన్నారు.

**●వీణవంక:** మండలంలోని చల్లూరు గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదును మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు. వివిధ బూత్‌లలో అధిక సభ్యత్వం నమోదు చేసినట్లు తెలిపారు. బీజేపీ సభ్యత్వం తీసుకొని కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చెన్న మాధవుని నర్సింహరాజు, ప్రశాంత్, సాయినాథ్, సదానందం, నవీన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

**●తిమ్మాపూర్:** మండలంలోని గొల్లపల్లి, నేదునూర్, లక్ష్మీదేవిపల్లి, వచ్చునూర్ గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరచారి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు సహ ప్రముఖ్ గడ్డం అరుణ్, జిల్లా, మండల నాయకులు కె లక్ష్మారెడ్డి, ఎం జనార్దన్‌రెడ్డి, కె శ్రీనివాస్, మధుకర్‌రెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.

## నగర పాలక సంస్థ ఉద్యోగ జేఏసీ గౌరవ అధ్యక్షుడిగా యాదగిరి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 22: నగరపాలక సంస్థ ఉద్యోగ జేఏసీ గౌరవ అధ్యక్షుడిగా, ఈఈ రొడ్డ యాదగిరిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నగరపాలక సంస్థ ఆవరణలో కార్పొరేషన్‌లోని వివిధ విభాగాలకు చెందిన పర్మినెంట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కమిషనర్ సువార్త హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషిచేయాలని సూచించారు. జేఏసీ సలహాదారుగా టిఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డిని, అధ్యక్షుడిగా నర్సయ్య ఉపాధ్యక్షులుగా బస్స వెంకన్న, బండారి లక్ష్మన్, పద్దిపెల్లి శంకర్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా, డిఇ లచ్చిరెడ్డి, కోశాధికారిగా అయూబ్‌ఖాన్, సంయుక్త కార్యదర్శిగా విజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సునీల్‌కుమార్, శ్రీధర్, చైతన్య పర్శరాం, నీర్ల రేవంత్, సుంచు రాకేశ్‌కుమార్, బాస్కర్, శేఖర్, రాచకొండ నాగరాజు, భజత్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తొలి సమావేశంలో ఉద్యోగుల భద్రత, సమస్యలు, వేతనాల పెంపు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు, మరణించిన ఉద్యోగ కుటుంబాల పరామర్శ తదితర అంశాలపై చర్చించి తీర్మానించారు.

## కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం ఎన్నిక

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 22: కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంఘం లక్ష్మణ్, ఎన్నికల పరిశీలులు యం కిరణ్, కోశాదికారి హర్మేందర్ సింగ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సయ్యద్ హమీద్ అలీ, గౌవర అధ్యక్షులుగా సయ్యద్ సీరాజుద్దీన్, సలహాదారుడు జె చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా టి. రాజశేఖర్, ఎ లక్ష్మణ్, ఎ.వరలక్ష్మీ, కార్యదర్శి పి.రమణ, సంయుక్త కార్యదర్శులుగా యస్ సురేందర్, కె సురేందర్, ముఖ్య సలహాదారులుగా యన్ మనోహర్, సలదారు కె భూమన్న, కోశాదికారిగా యం శ్రావణ్ కుమార్, ప్రచార కార్యదర్శిగా పి హరినాథ్, నిర్వహణ కార్యదర్శి సిహెచ్ ప్రేమ్ కుమార్, సాంస్కృతక కార్యదర్శి పి. శ్రీదేవి, సభ్యులుగా యం ఇంద్రసేనరెడ్డి, జి వెంకటనర్సయ్య కె సువర్ణ, యండి సాబీర్ బాబా, యం మధుసూదన్, బి మణేమ్మలను ఎన్నుకున్నారు.

## 'ట్రస్మా' మద్దతుతో టీచర్ ఎమ్మెల్సీగా పోటీ

### -మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి



మాట్లాడుతున్న మానేరు అధినేత కడారి అనంతరెడ్డి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 22: తెలంగాణ ప్రభుత్వ ఆమోదిత పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా) రెండు వర్గాలు బలపరుస్తున్న అభ్యర్థిగా కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్నట్లు మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి ప్రకటించారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మీడియా సమావేశంలో అనంతరెడ్డి మాట్లాడుతూ తనకు జూనియర్, డిగ్రీ, బీఎడ్ కళాశాలల అసోసియేషన్, ఇతర సంఘాలు కూడా ఇప్పటికే సంఘీభావం ప్రకటించాయని అన్నారు. అవకాశం ఇస్తే బీజేపీ మద్దతుతో లేనిపక్షంలో ట్రస్మా, ఇతర విద్యా సంఘాల అండదండలతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడం ఖాయమని స్పష్టం చేశారు. ఈవిలేకరుల సమావేశంలో ట్రస్మా జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, ఎ.రాంచంద్రారెడ్డి, రిటైర్డు ప్రిన్సిపాల్, లయన్ బుర్ర మధుసూధన్‌రెడ్డి, తులసీ ప్రకాశ్, మల్లారెడ్డి, కృపాదానం, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు పూర్తయ్యేదెన్నడో?

### -ఇబ్బందులు పడుతున్న రజ్వీచమన్ కాలనీ వాసులు -పట్టించుకోని అధికారులు


బురదమయంగా మారిన రోడ్డు

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్22: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామ పరిదిలోని పలు కాలనీల్లో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. బొమ్మకల్ గ్రామ పరిధిలోని రజ్వీచమన్ కాలనీలో గత ఎనిమిది నెలల కిందట కొత్తరోడ్డు మంజూరు కాగా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. రోడ్డును తవ్వి కంకర పోసి విడిచిపెట్టాడు. దీంతో సీసీ రోడ్డు వేయక పోవడంతో కాలనీవాసులు కంకర రోడ్డుపైనే రాకపోకలు కొనసాగించారు. అయితే ఇటీవల కంకరతో ఉన్న రోడ్డుపై మట్టి పోసి చదును చేశారు. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా కాలనీలో రోడ్డు బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు. ఈ కాలనీ నుంచే సిటిజన్ కాలనీ వాసులు కూడా ప్రయాణించాల్సి ఉంది. దీంతో ఈ రహదారి పూర్తిగా బురదమయం కావడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు. కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు విన్న వించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. వెంటనే రోడ్లను పూర్తి చేసి తమ ఇబ్బందులు తొలగించాలని రజ్వీచమాన్, సిటిజన్ కాలనీ వాసులు అధికారులను కోరుతున్నారు.

# గ్రంథాలయాలకు కొత్త భవనాలు కలేనా?

● ఇరుకు గదులతో పాఠకుల ఇబ్బందులు


హుజూరాబాద్‌లో శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయం

హుజూరాబాద్, సెప్టెంబరు 22: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో విజ్ఞానాన్ని అందజేసే గ్రంథాలయాలకు కష్టాలు తప్పడం లేదు. ఫలితంగా నిరుద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదిగారు. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో గ్రంథాలయాలు నిర్వీర్యమయ్యాయి. హుజూరాబాద్ డివిజన్ లో దాదాపు అన్ని మండలాల్లో గ్రంథాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వాలు ఓ వైపు డిజిటల్ గ్రంథాలయాలు నిర్మిస్తున్నామని చెబుతున్నా హుజూరాబాద్ డివిజన్‌లోని గ్రంథాలయాల పరిస్థితి మాత్రం ఏ మార్పు కానరావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో గ్రంథాలయ నిర్మాణం చేపడతామని హడావుడి చేసి నప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో పాటు పాత గ్రంథాలయ భవనం మరమ్మతులకు నోచుకోలేకపోయింది. పాఠకులు ఇరుకుగా ఉన్న భవనాల్లోనే ఇబ్బందులు పడుతున్నారు. హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో ఓటర్లు సుమారు లక్షకు పైగా ఉంటారు. సౌకర్యాలు గల గ్రంథాలయాలు లేకపోవడంతో పాఠకులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకొని గ్రంథాలయాలను మెరుగుపరచాలని పాఠకులు, నిరుద్యోగులు కోరుతున్నారు.

## వరద కాలువ నుంచి 'కాకతీయ'కు నీటి విడుదల

గంగాధర, సెప్టెంబరు 22: వరద కాలువ నుంచి కాకతీయ కాలువకు ఆదివారం నీటిపారుదల శాఖ అధికారులు నీటిని విడుదల చేశారు. పెద్దపల్లి, రామగుండం నీటి అవసరాల మేరకు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ర్యాలపల్లి వద్ద గేట్లు ఎత్తగా వరద కాలువ నీరు మల్యాల మండలం తాటిపల్లి సమీపంలోని కాకతీయ కాలువ నుంచి దిగువకు వెళ్లాయి. రోజుకు 1050 క్యూసెక్కుల నీరు విడుదలవుతున్నాయి. నీటి విడుదల వారం రోజులపాటు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు.


గేట్లు ఎత్తడంతో లింక్ కెనాల్‌లో ఉరకలేస్తున్న నీరు

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం


మానకొండూర్‌లో 1992-93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

మానకొండూర్, సెప్టెంబరు 22: మూడు దశాబ్దాల క్రితం ఒకే గూడు కింద చదువుకున్న విద్యార్థులు మళ్లీ ఒక్క చోట కలిసారు. మానకొండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మానకొండూర్‌లోని ఓ కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. 30 ఏళ్ల తర్వాత కలుసుకొని ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాడు చదువు చెప్పిన గురువులను పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. మృతి చెందిన, గురువులు, పూర్వ విద్యా ర్థుల ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, పుప్పాల శ్రావణ్‌కుమార్, ఎం. శ్రీనివాస్, రామగిరి విష్ణుమూర్తి, వెంకటరమణ, దాసరి వీరభద్రం, శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల మాదవి, జయశ్రీ, కన్నబత్తుల శ్రీలత, కన్నబత్తుల కవిత, నందగిరి రామకృష్ణ పాల్గొన్నారు.

**తిమ్మాపూర్:** మండలంలోని మన్నెంపల్లిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011-12 సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు.


మన్నెంపల్లిలో..

## కొత్తపల్లి మున్సిపల్ కమిషనర్‌గా వేణుమాధవ్

భగత్‌నగర్, సెప్టెంబరు 22: కొత్తపల్లి మున్సిపల్ కమిషనర్‌గా కట్ల వేణుమాధవ్ బాధ్యతలు చేపట్టారు. కొత్తపల్లి కమిషనర్‌గా పనిచేసిన రమేష్ డిప్యూటేషన్ రద్దు చేసి సొంత మున్సిపాలిటీకి బదిలీ చేశారు.

## నేడు ఆలయాల హుండీలు లెక్కింపు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 22: నగరంలోని దేవాదాయశాఖ పరిధిలో గల రెండు ఆలయాల హుండీలను సోమవారం లెక్కించనున్నట్లు ఆయా ఆలయాల ఈఓ నాగారపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను ఉదయం 9గంటలకు, ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ హుండీలను మధ్యాహ్నం 12 గంటలకు లెక్కిస్తామని పేర్కొన్నారు. ఆలయాల సిబ్బంది విధిగా హాజరు కావాలని, ఔత్సాహిక భక్తులు కూడా పాల్గొనవచ్చని తెలిపారు.

## పారమితలో జోష్ వేడుకలు

భగత్‌నగర్, సెప్టెంబరు 22: పారమిత పాఠశాల ఉపాధ్యాయులు జోష్ వేడుకలను ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పాఠశాల ఛైర్మన్ ప్రసాదరావు దంపతులను సన్మానించారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రష్మిత, రాకేష్, వియుఎం ప్రసాద్, టిఎస్‌వి రమణ, వినోద్‌రావు, హన్మంతరావు, ప్రధానో పాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, శ్రీకర్, కవితాప్రసాద్, శర్మిష్ట, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'మేము' కరీంనగర్ బ్రదర్స్ పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 22: నగరంలోని ఫిలిం భవన్‌లో ఆదివారం డిగ్రీ మిత్రులు, ఎస్పీ ఫ్రెండ్స్, కరీంనగర్ ఫిలిం సొసైటీ, సాహితీగౌతమి సంయుక్త ఆధ్వర్యంలో కరీంనగర్ వ్యాఖ్యాన సోదరులుగా పేరొందిన మాడిశెట్టి గోపాల్, కెఎస్ అనంతాచార్యులపై వచ్చిన కవిత్వం 'మేము' కరీంనగర్ బ్రదర్స్ పుస్తకావిష్కరణ-అంకితోత్సవం జరిగింది. ముఖ్య అతిథి, కృతి స్వీకర్తగా పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్ పాల్గొని మాట్లాడుతూ స్వచ్ఛమైన స్నేహానికి నిదర్శనం మాడిశెట్టి గోపాల్, కెఎస్ అనంతాచార్యలని అన్నారు. కార్యక్రమంలో గాజుల రవీందర్, మఖన్లాల్ యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడు రావికంటి శ్రీనివాస్, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ కలువకుంట రామకృష్ణ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 22: సామాజిక సేవలో భాగంగా ప్రతిఒక్కరు మొక్కలు నాటాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మెన్ వి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ-2024 పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవడంతో పర్యావరణాన్ని రక్షించిన వాళ్ళమవుతామన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్, కుంటాల శ్రీనివాస్, జిల్లా రమణ, చాడ మధుసూధన్‌రెడ్డి, పి శ్రీనివాస్‌శర్మ, డి నగేశ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీగా సుగుణాకర్‌రావు గెలుపునకు కృషి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 22: నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి, బీజేపీ పటిష్టతకు కృషిచేస్తున్న సీనియర్ న్యాయవాది, బీజేపీ సీనియర్ నాయకుడు పొల్సాని సుగుణాకర్‌రావును వచ్చే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించుకునేందుకు ఐక్యంగా కృషిచేద్దామని పలువురు ఆయన అభిమానులు, మద్దతుదారులు ప్రకటించారు. ఆదివారం ఆయన నివాసానికి వివిధ ప్రాంతాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సుగుణాకర్‌రావు అభిమానులు చేరుకొని ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న సుగుణాకర్ రావుకు మద్దతు ప్రకటించారు. దేశవ్యాప్తంగా రైతాంగ సమస్యలపై అనేక పోరాటాలు చేశారని, సుగుణాకర్‌రావును గెలిపించాలని ప్రజలకు వారు విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు దుర్గం మారుతి, గంప జగన్, ఎలగందుల నందకుమార్, తాడూరి బ్రహ్మం, జెడి భగవాన్, కనక చంద్రం, నర్సింగోజు రామకృష్ణ, గుడిపాటి జితేందర్‌రెడ్డి, నందెల్లి మహిపాల్, భాస్కర్, మొలుగూరి కిశోర్, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, మావురపు సంపత్, శ్రీనివాస్‌గౌడ్, బుర్ర సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 22: మండలంలోని చెల్పూర్, తోకలపల్లి గ్రామాల్లో జన వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏకశిల, లక్ష్మీనరసింహ ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి హాజరైన రోగులకు గైనకాలజిస్ట్, కార్డియాలజి, న్యూరాలజి, చెస్ట్, ఆర్థోపెడిక్ పరీక్షలను వైద్య సిబ్బంది నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జన వికాస సెంటర్ మేనేజర్ ఎండీ ఖాజాని, కో ఆర్డినేటర్లు లీలా, రజిత, డాక్టర్ తేజ తదితరులు ఉన్నారు.

**జమ్మికుంట రూరల్:** జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామంలో సురక్ష ఆసుపత్రి డాక్టర్ తిరుపతి అధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తిరుపతి మాట్లాడుతూ ఈ రోజుల్లో వైరల్ జ్వరాలు, ఇతర వ్యాధులు ఎక్కువ వస్తున్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వైద్య శిబిరంలో ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది అనిల్ కూమార్, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

వీణవంక, సెప్టెంబరు 22: మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నల్ల రాధమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని అతిథి డెవలపర్స్ అధినేత కాంగ్రెస్ నాయకుడు కొమ్మిడి రాకేష్‌రెడ్డి పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు నల్ల కొండాల్‌రెడ్డి, పత్తి సమ్మిరెడ్డి, తిరుమల్, సతీష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

మానకొండూర్, సెప్టెంబరు 22 : మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి జ్యోతి అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 16 మృతి చెందింది. కాగా తెలంగాణ దివ్యాంగుల పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో వెన్నో ట్రస్టు ద్వారా రూ. 10వేల చెక్కును ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. ట్రస్టు ఛైర్మన్ తాతారావు, లక్ష్మయ్య, జగదీశ్వర్ ఉన్నారు.

## డీపీవోపై చర్యలు తీసుకోవాలి

రామడుగు, సెప్టెంబరు 22: మండలంలోని గోపాల్‌రావుపేటలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి సరైన హద్దులు చూపించకుండా, అనుమతి ఇచ్చిన డీపీవోపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. నిర్మాణం జరుగుతున్న ప్రాంతం వద్ద నిరసన వ్యక్తం చేశారు. దేవాలయ నిర్మాణానికి హద్దులు సరైన విధంగా చూపించలేదని ఆరోపించారు. కాగా దేవాలయం పునర్ నిర్మాణం చేపట్టడానికి అనుకూలంగా తీర్పు రావడంతో ఓ వైపు పనులు జరుగుతున్న నేపథ్యం లో కర్ర సత్యప్రసన్న నిరసన చేపట్టడం చర్చకు దారి తీసింది.